# పైతృకం

విజయకు తెలివి వచ్చిననాటి నుంచి తండ్రి తల్లిని పీడించడమే చూసింది. ఏదో వంకతో ఆమెను ఎత్తిపొడవడం హేళనగా మాట్లాడడం అతనికలవాటే. తల్లి సావిత్రి పెళ్ళయి, అత్తవారింట్లో అడుగుపెట్టిన నాటి నుంచి ఆమెది బానిస బతుకే అయిందని తెలుసుకుంది విజయ. తండ్రి శేషయ్య అన్నీ తనకిష్టమొచ్చినట్లుగానే చేసేవాడు. భార్య సావిత్రిని ఏదైనా అడిగి చేయడం ఆమె సలహా తీసుకోవడం అతనికలవాటే లేదు. ఎవరైన "ఇంట్లో అడిగారా?" అని అంటే "ఇంట్లో ఏందయ్యా అడిగేది. దానికేం తెలుసని? అయినా దాని పెత్తనమేమిటి?నాకు తెలియదా ఏం చేయాలో!" అట్లా అంటూ పెత్తనమంతా ఆయనే చేసుకవచ్చాడు. ఊర్లో పెత్తనం ఇంట్లో పెత్తనం అంతా ఆయనదే. ఆరోజు ఇంట్లో ఏం కూర వండాలో ఆయన చెప్పాల్సిందే. వేరే కూర ఏది వండినా ఆరోజు సావిత్రికి తిట్లు తప్పవు.

"దమ్మిడీ తేకున్నా పెత్తనం మాత్రం బాగానే చేస్తుంది!" అని మొదలుపెడ్తాడు శేషయ్య. ఇక సావిత్రి కుమిలికుమిలి ఏడ్వడం తప్ప ఏమీ చేసేది లేక అనేది లేక ఊరుకుంటుంది.

సావిత్రి ఎప్పుడైనా తల్లిగారింటికి పోయినా ఆమెకక్కడ సుఖశాంతుల్లేవు. తల్లీతండ్రి లేని ఆమెకు అక్కడ ఆసరాగాని ఊరట కలిగించేవాళ్ళు గాని ఎవరూ లేరు. అన్నలు తమ్ములున్నారు. వాళ్ళు తండ్రి ఇచ్చిన ఆస్తి పంచుకోవడంలో కొట్లాటలు పెట్టుకొని ఒకరితో ఒకరికి మాటల్లేవు. ఒకరింటికి మరొకరు వెళ్ళరు. తండ్రి తాతలు ఇచ్చిన ఆస్తిని బాగానే కాపాడి ఇంకాస్త తానూ కొన్ని భూములు కొని జోడించి ఆస్తిని భద్రంగా సావిత్రి తండ్రి కొడుకులకు ఇచ్చాడు. ఆ బోలెడు ఆస్తిని పంచుకోవడంలో వాళ్ళకెవరికీ తృప్తి లేదు. ప్రతి ఒక్కరూ తనకు అన్యాయం జరిగిందనే సావిత్రి ముందు గోడు మొదలుపెడ్తారు. సావిత్రి ఒకరింటికి వెళ్తే ఇంకొకరికి కోపం. ఆ విధంగా వాళ్ళ కొట్లాటల మధ్య ఆమె మంచీ చెడు

అడిగేవారు కారు. దాంతో ఆమె అక్కడికి వెళ్ళి వాళ్ళ గొడవల్లో తలదూర్చడమెందుకని తల్లి గారింటికి వెళ్ళడమే మానేసింది.

సావిత్రి తల్లిదండ్రులకు ఒక్కతె కూతురు. "ఒక్కతె కూతురు! బాగా వున్నవాడు. కట్నం కానుకలు అడుగకున్నా బాగానే ఇస్తారు కదా!" అని శేషయ్య తలిదండ్రులు ఈ సంబంధానికి ఒప్పుకున్నారు. కాని సావిత్రి తండ్రి పెళ్ళిలో వియ్యాలవారికి అన్నీ ఎగ్గొట్టడానికే చూసాడు.

"ఇదేమిటి! ఒక్కతె కూతురు. ఆ కూతురుకు పెట్టుకోవాల్సింది కూడా ఈయన పెట్టుకోవడంలేదు! ఇదేమి పిసినారితనమో!" అని ఆశ్చర్యపోయారు శేషయ్య తలిదండ్రులు. వాళ్ళు పెళ్ళిలో అలిగారు. గొడవ చేసారు. పెళ్ళి ఎక్కడ ఆగిపోతుందోమోనని సావిత్రి తల్లి భయపడింది. వియ్యపురాలి కాళ్ళావేళ్ళాపడి వేడుకుంది.

"వదినా! అది మాకు ఒక్కతె పిల్ల! దానికి పెట్టుకోక ఎవరికి పెట్టుకుట్టాం చెప్పండి! ఏదో కాలం కలిసిరాక ఈ యేడు పంట చేతికి రాక కటకటగా వుండి ఆయన అట్లా వెనుకా డ్తున్నారు. ఈ రోజు కాకపోతే ఇంకోరోజు మేం బతికున్నంతకాలం - మేము పోయినా దాని అన్నలు తమ్ములు ఏదో పెడ్తానే వుంటాం! దానికి తక్కువ చేస్తామా? చెప్పండి! ఆయనం టున్నారు తర్వాత సద్దుతానని తప్పకుండా సద్దుతారు. మీరనుకున్న దానికన్నా ఇంత ఎక్కువే ముట్టజెప్తారు ఆయన" అంది సావిత్రి తల్లి.

కాని స్తావిత్రి పెళ్ళయ్యాక ఒక్క మొదటి కాన్పుకు ఖర్చుపెట్టాడు ఆమె తండ్రీ. అంతే! "పెళ్ళిలో ఇయ్యవలసిన కట్నం కానుకలు ఏవి?" అని శేషయ్య అడిగితే -

"ఇస్తాం నాయనా! తొందరెందుకు పడ్తావు. దానికి ముట్టవలసింది ముట్టజెప్తాం" అన్నాడు సావిత్రి తండ్రి.

కాని ఆ ముట్టవలసింది ముట్టజెప్పకుండానే సావిత్రి తండ్రి, ఆ తర్వాత తల్లి వెళ్ళి పోయారీ లోకం నుంచి. సావిత్రికియ్యవల్సిందాని గురించి అన్నదమ్ములు పట్టించుకోలేదు. పైతృకమైన ఆస్తిని సమానంగా పంచుకోవడంతోనే వాళ్ళకు తీరిక లేకుండా పోయింది. ఇక సావిత్రి కష్టనష్టాల గురించి ఆలోచించే తీరికే లేదు వాళ్ళకు.

పెళ్ళయ్యాక కట్నం కానుకలియ్యలేదని సావిత్రిని ఆమె అత్తమామలు జీవించి వున్నం తకాలం సూటిపోటి మాటలతో వేధించారు. వాళ్ళతోపాటు శేషయ్య గొంతు కలిపేవాడు. తల్లిదండ్రులు పోయింతర్వాత శేషయ్య ఒక్కడే ఆ బాధ్యతనంతా నెత్తిమీద వేసుకొని సావిత్రిని ఎత్తిపొడుపు మాటలతో హేళనలతో పీడించేవాడు.

★ ★ ★

పెళ్ళయ్యాక కొత్తలో సావిత్రి అత్తమామలు ఇయ్యవలసిన కట్నం కానుకలు అడుక్క

రమ్మని సావిత్రిని తలిదండ్రి దగ్గరికి పంపారు కూడా.

"మీ నాన్ననడిగి నీకు రావల్సిన కట్నం కానుకలు తెస్తే సరే! లేకపోతే ఇంట్లోకి రానియ్యం! అది గుర్తు పెట్టుకో! మీ నాన్నకూ ఆ విషయం చెప్పు!" అని బెదిరించి చెప్పి సావిత్రిని తల్లిగారింటికి పంపారు.

సావిత్రి వెళ్ళి తండ్రితో అదే విధంగా చెప్పింది. అది విని తండ్రి తేలిగ్గా కొట్టి పారేసినట్లుగా చిరునవ్వు నవ్వాడు.

"అట్లయితే నాలుగు రోజులుండి నీ భర్త అత్తమామల కోపం చల్లారకనే వెళ్ళవే సావిత్రీ ! మీ ఆయన ఒక్కడే కొడుకు. వాళ్ళకున్నది చాలదా? ఇంకా అది తే ఇది తే అని ఏం చేసుకుంటారుట! నేను ఇచ్చేది వాళ్ళకు తక్కువయిందా!" చిరునవ్వు నవ్వుతూనే అన్నాడు సావిత్రి తండ్రి.

తండ్రి నిజాయితీ ఏమిటో కూతురికి అర్థమైంది. "అదేమిటి! నేనూ యీ ఇంట్లో పుట్టాను గదా! అన్నలకు తమ్ములకు చెందవలసిన ఆస్తిలో తనకూ వాటా వుంటుంది గదా! మరి ఎందుకు నాన్న నన్ను ఊరికే ఏమీ ఇయ్యకుండా ఇంకొకరి చేతిలో పెట్టాలని చూస్తున్నాడు!" అర్థం కాలేదు సావిత్రికి. ఆమె హృదయంలో ఎక్కడో నొప్పి అనిపించింది.

తర్వాత సావిత్రిని ఆమె తండ్రి ఉత్తచేతులతోనే అత్తవారింటికి పంపాడు. సావిత్రి అత్తమామలు భర్త ఆమెతండ్రి చేసిన మోసాన్ని విషం మింగినట్లుగా మింగి ఊరుకున్నారు. ఆ మింగిన విషాన్ని అప్పుడప్పుడు సావిత్రి మీద కక్కారు.

తండ్రి చేసిన మోసానికి సావిత్రి మనస్సు చివికిపోయింది. తనదంటూ తనకేం లేదని ఆమె గుర్తించింది. దాంతో ఆమె నోరెత్తకుండా భర్త అనే మాటలు పడడం నేర్చుకుంది. తన ఇంట్లో తనే బానిసగా బతకడం అలవాటు చేసుకుంది. సహనం అలవరచుకుంది. ఓర్పు నేర్చుకుంది. అణుకువగా నడుచుకోవడం, భర్త కెదురు తిరిగి మాట్లాడకుండా భర్త ఏమన్నా ఏది చేసినా పల్లెత్తు మాట అనకుండా వుండడం ఆమె జీవితాదర్శమైంది.

★ ★ ★

విజయ శేషయ్యకు ఒక్కతె కూతురు. తర్వాత ఇద్దరు కొడుకులున్నారు. విజయ అంటే చిన్నప్పటి నుంచి శేషయ్యకు ప్రాణం. "నా కూతురు చాలా తెలివైంది. దాన్ని డాక్టరీ చదివిస్తాను!" అని గర్వంగా చెప్పుకునేవాడు శేషయ్య.

విజయ చదువు బాగానే చదువుకుంది. తండ్రి కోరికను తీరుస్తూ ఎం.బి.బి.యస్. చదివింది.

"నా కూతురు బాగా చదివింది. దానికి తగ్గట్లుగా చదివిన సంబంధం చేస్తాను" అన్నాడు శేషయ్య. అదే విధంగా డాక్టరు చదివిన అల్లుడ్నే మాట్లాడాడు.

పెళ్ళినాటికి విజయ హౌస్‌సర్జను అయిపోవచ్చింది. పెళ్ళికొడుకు భాస్కర్ హౌస్ సర్జను రెండేళ్ళకిందనే పూర్తి చేసి వాళ్ళ ఊళ్ళో స్వంతంగా నర్సింగుహోమ్ పెట్టుకున్నాడు. ఇప్పుడిప్పుడే అది పుంజుకుంటోంది. ఆ నర్సింగుహోమ్‌లో డాక్టరమ్మ ఉండడానికి డాక్టరీ చదివిన ఆవిడనే పెళ్ళి చేసుకోవాలనుకున్నాడు భాస్కర్. "అందులో విజయ తండ్రికి బాగానే ఆస్తి సంపాదనలున్నాయి. ఒక్కతె అమ్మాయి. బాగానే కట్నం కానుకలు ముట్టజెప్తారు!" అనుకున్నాడు భాస్కర్. అతని తలిదండ్రులు అదే అనుకున్నారు. సంబంధం మాట్లాడిన మధ్యవర్తులూ అదే అన్నారు. కాని పెళ్ళి చూపులయ్యాక అమ్మాయి నచ్చిందని చెప్పిననాడే శేషయ్య పెళ్ళివాళ్ళకు స్పష్టం చేసాడు -

"కట్నం కానుకలు నా ఆశయాలకు ఆదర్శాలకు విరుద్ధమండి! నా కూతురును కొడుకులతో సమానంగా చదివించాను. దాన్ని ఏ లోటు లేకుండా పెంచాను. దానికి తగిన వరుణ్ని చూడాలనుకున్నాను. చూసాను. ఘనంగా నా తాహతుకు తగ్గట్లుగా పెళ్ళి చేస్తాను. ఇక మీ ఇష్టం! కట్నం పేరుతో నేను మాత్రం ఏమీ ఇయ్యను. అది నా అభిమతానికే నచ్చని విషయం" అన్నాడు.

శేషయ్య మాటలు విని భాస్కర్ తలిదండ్రులు ముక్కూ మూతి విరిచారు.

"అయ్యో! మీరేమీ బాధపడకండి. శేషయ్యగారు కట్నానికి విరుద్ధమే గాని పెట్టుపోతలు బాగానే చేస్తారు. వారి తాహతుకు తగ్గట్లుగా- కట్నం అనేది మీకు ముట్టకున్నా అంతకన్నా ఎక్కువే ఆయన పిల్లకు ఇచ్చుకుంటాడు. ఆయనకేం తక్కువని. కూతురుకి- అందులో ఒక్క కూతురాయె. పెట్టుకోకుండా వుంటాడా? ఆ అమ్మాయికి అన్యాయం ఏ కోశానా చెయ్యడు. మీరేం భయపడకండి!" అన్నారు మధ్యవర్తులు.

"అమ్మాయి డాక్టరు! నాకు నచ్చింది" అని నసిగాడు భాస్కర్.

"అయినా వాళ్ళ పిల్లకు వాళ్ళు పెట్టుకోవడం మానేస్తారా! మన ఛాదస్తం గాని" అన్నాడు భాస్కర్ తండ్రి రాజీకి వచ్చి.

విజయ పెళ్ళి భాస్కర్‌తో అయింది. కాని అందరూ అనుకోని విధంగా శేషయ్య కూతురుకేం ఇయ్యకుండానే పెళ్ళి చేసాడు.

"నా ఆదర్శానికి అనుగుణంగా వుండే అల్లుడు దొరికాడోయ్! కానీ కట్నం లేకుండా నా కూతుర్ని పెళ్ళాడాడు. అఁ- నా కూతురేం తక్కువా? అదీ డాక్టరు. రేపు సంపాదిస్తే అది నాకిస్తుందా? దాని సంపాదనంతా వాళ్ళకే కదా!" పెద్దగా నవ్వాడు శేషయ్య. పెళ్ళిలో వచ్చిన బంధువులతో అన్న యీ మాటలు విని భాస్కర్ తలిదండ్రులు కోపంతో చిందులు వేసారు. అయిష్టంగానే కోడలిని తీసుకొని వెళ్ళారు.

"ఏమోయ్! మీ నాన్న మొండిచేయిచూపించాడు గదా చివరకు. ఏమేమో ఇస్తాడను

కున్నారు మావాళ్ళు. ఏం లేకుండానే నిన్ను అత్తారింటికి తోలేసాడు!" పరిహాసం తొణికేలా నవ్వాడు భాస్కర్ మొదటిరాత్రి.

"అంతేనండి! ఆస్తి అనేది మగపిల్లలకు. అందులో ఆడపిల్లకు భాగంలేదు!" అని వ్యంగ్యంగా అందామనుకుంది విజయ. కాని అందులో వున్న తన బాధను భర్త సానుభూతిగా అర్థం చేసుకుంటాడో లేదో అని ఊరుకుంది విజయ.

తెల్లారి ఆమెను చూడడానికి బంధువులు పొరుగూళ్ళు వచ్చారు. "మీ కోడలు ఏం కట్నం తెచ్చిందండి" అని అడిగారు గాని మీ కోడలు ఏం చదివిందండి అని ఎవరూ అడుగలేదు.

అది చూసి విజయ కోపంగా మూతి ముడుచుకుంది.

తన జీవితమూ తన తల్లి జీవితంలాగానే పరిహాసాల పాలవుతుందా? హేళనకు గురవుతుందా? - అనుకొని వణికిపోయింది విజయ.

తన తండ్రిగాని, తనతల్లి తండ్రిగాని ఇంకా అంతకుముందు అమ్మమ్మ తండ్రిగాని ఆస్తి కొడుకులకు ఇయ్యాలి! కూతుర్ని పెళ్ళిచేసి పంపాలి! - సాధ్యమైనంతవరకు ఉత్తగానే దాన్ని పైతృకమైన ఆస్తి నుంచి వంచితురాల్ని చేసి పంపించాలి! - అని చూసారు! తన తల్లి తన అమ్మమ్మ ఇట్లా అందరూ ఆస్తి నుంచి వంచితలై అత్తగారిళ్ళల్లో అవమానాల పాలయ్యారు. బానిసల బతుకులైపోయాయి వాళ్ళవి. తనూ అంతేనా? అని భయపడిపోయింది విజయ.

కాని తాను చదువుకున్నది! తన తల్లిలాగా తన అమ్మమ్మలాగా ఆస్తి కట్నం కానుకల సంకెళ్ళల్లో చిక్కుకోకూడదు. అత్తింటి బానిస కాకూడదు! తను సర్వస్వతంత్రురాలు! ఈ సంకెళ్ళను తెంచుకొని తను వాటికి అతీతంగా తన స్వేచ్ఛను తను అనుభవించాలి! అని నిశ్చయంగా నిర్భయంగా రెండోరోజు రాత్రి తన భర్త గదివైపు అడుగులేసింది విజయ.

* * *